# ఖమ్మం ఆశ్రమ పాఠశాలల్లో అస్తవ్యస్తం: పర్యవేక్షణపై 'నీలి నీడలు'!

## విద్యార్థుల క్షేమం గాలికి.. ఉన్నతాధికారుల తూతూమంత్రపు తనిఖీలు!.. అటెండెన్స్ 'నీల్'.. కలెక్షన్స్ 'ఫుల్'.. గిరిజన బిడ్డల బతుకులు బుగ్గిపాలు!

(ఖమ్మం - మహా బ్యూరో రిపోర్ట్)

ఖమ్మం జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్నాయి. అడవి బిడ్డలకు అక్షర వెలుగులు పంచాల్సిన ఈ నిలయాలు, నేడు అధికారుల నిర్లక్ష్యానికి, అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారాయి. పర్యవేక్షించాల్సిన ఉన్నతాధికారులు ఏసీ గదులకే పరిమితం కావడం, క్షేత్రస్థాయిలో గిరిజన సహాయ సంక్షేమ అధికారులు (atdo) చక్రం తిప్పుతుండటంతో వ్యవస్థ మొత్తం కుప్పకూలుతోంది..మరి ఖమ్మం డివిజన్ అధికారిని తీరుపై పలువూరు మండి పడుతున్నారు.

**కారేపల్లిలో 'విష' ప్రయోగం.. అధికారుల 'గోప్యత' మర్మమేమిటి?**

ఇటీవల కారేపల్లి మండలంలోని ఒక ఆశ్రమ పాఠశాలలో జరిగిన 'ఫుడ్ పాయిజన్' ఘటన జిల్లావ్యాప్తంగా కలకలం రేపింది. కలుషిత ఆహారం తిని విద్యార్థులు అస్వస్థతకు గురైతే, ఆ విషయాన్ని బయటకు పొక్కనీయకుండా అధికారులు తొక్కిపెట్టడం గమనార్హం. తమ శాఖకు చెడ్డపేరు వస్తుందనో, లేక కాంట్రాక్టర్లతో ఉన్న సంబంధాల వల్లనో కానీ, విద్యార్థుల ప్రాణాపాయ స్థితిని కూడా గోప్యంగా ఉంచారు. * జిల్లా గిరిజన సంక్షేమ అధికారిని (DTWO) సైతం తప్పుదోవ పట్టిస్తూ, కింది స్థాయి అధికారులు ఉన్నత స్థాయి వ్యక్తులతో కుమ్మక్కై వాస్తవాలను సమాధి చేశారు. ఇది కేవలం నిర్లక్ష్యం మాత్రమే కాదు, విద్యార్థుల ప్రాణాలతో ఆడుకుంటున్న నేరం.

**అటెండెన్స్ నీల్.. కలెక్షన్స్ ఫుల్!**

ఆశ్రమ పాఠశాలల్లో రికార్డుల నిర్వహణ చూస్తే ఎవరైనా ముక్కున వేలేసుకోవాల్సిందే. క్షేత్రస్థాయిలో విద్యార్థుల హాజరు చాలా తక్కువగా ఉంటున్నా, కాగితాల్లో మాత్రం వందకు వంద శాతం ఉన్నట్లు చూపిస్తున్నారు. "విద్యార్థులు లేకపోయినా ఉన్నట్లు బోగస్ అటెండెన్స్ వేసి, వారి పేరు మీద వచ్చే డైట్ ఛార్జీలు, కాస్మెటిక్ ఛార్జీలను అధికారులు దారి మళ్లిస్తున్నారు. హాస్టళ్లలో అటెండెన్స్ 'నీల్' (సున్నా) ఉన్నా, అధికారుల జేబుల్లో కలెక్షన్స్ మాత్రం 'ఫుల్' గా ఉంటున్నాయి."

**పనిచేయని వాటర్ ప్లాంట్లు.. దాహంతో అలమటిస్తున్న విద్యార్థులు**

ప్రభుత్వం లక్షల రూపాయలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్లు జిల్లాలోని అనేక పాఠశాలల్లో మూలన పడ్డాయి. కొనిజర్ల బాయ్స్ మరియు గర్ల్స్ హాస్టళ్లు, వల్లబి, కల్లూరు, రేలకాయలపల్లి, శాంతినగర్, ములపోచారం వంటి ప్రాంతాల్లో విద్యార్థులు శుద్ధి చేసిన జలాలు లేక కలుషిత నీటినే తాగుతున్నారు. దీనివల్ల విద్యార్థులు తరచూ విష జ్వరాలు, చర్మ వ్యాధుల బారిన పడుతున్నారు. రిపేర్లు చేయించాల్సిన వార్డెన్లు, పర్యవేక్షించాల్సిన అధికారులు మాత్రం 'నిధులు లేవు' అనే సాకుతో కాలయాపన చేస్తున్నారు.

**మానసిక ఒత్తిడిలో విద్యార్థులు.. వినోదానికి నోచుకోని వసతి**

వసతి గృహాల్లో ఉండే విద్యార్థులకు సెలవు దినాల్లో కాస్త ఉపశమనాన్ని ఇచ్చే టెలివిజన్లు (TVs) సైతం పనిచేయడం లేదు. కనీసం వార్తలు చూసే అవకాశం లేక, బయటి ప్రపంచంతో సంబంధం తెగిపోయి విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు. పొద్దంతా చదువు, రాత్రిళ్లు అపరిశుభ్ర వాతావరణం మధ్య గడిపే పిల్లలకు కనీస వినోదం కూడా కరువైంది.

**పేరుకుపోయిన సమస్యలు**

- వసతుల లేమితో అవస్థలు.. జిల్లాలోని పలు హాస్టళ్లలో పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది:
- కిటికీలు, తలుపులు లేని గదులు: గాలి, వెలుతురు సరిగ్గా లేని గదుల్లో విద్యార్థులు మగ్గిపోతున్నారు.
- అపరిశుభ్ర మరుగుదొడ్లు: పారిశుధ్యం అన్న మాట వినిపించదు. గర్ల్స్ హాస్టళ్లలో సైతం ఇదే పరిస్థితి ఉండటం శోచనీయం.
- నాసిరకం భోజనం: సన్నబియ్యం పేరుతో నాసిరకం బియ్యం, పురుగులు పట్టిన పప్పు దినుసులతో వంటలు చేస్తున్నారు.

**ఉన్నతాధికారుల 'తూతూమంత్రపు' విజిట్లు**

ఏదైనా సమస్య వచ్చినప్పుడు లేదా ఫిర్యాదులు వెల్లువెత్తినప్పుడు అధికారులు పేరుకు మాత్రమే విజిట్ చేస్తున్నారు. వార్డెన్లు ఇచ్చే తప్పుడు నివేదికలనే నిజమని నమ్మి, ఏసీ కార్లలో వచ్చి సెల్ఫీలు దిగి వెళ్తున్నారే తప్ప, విద్యార్థులతో విడివిడిగా మాట్లాడి వాస్తవాలు తెలుసుకునే సాహసం చేయడం లేదు.ఖమ్మం జిల్లా కలెక్టర్ గారు వెంటనే స్పందించి, పారదర్శకత లేని అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలనీ విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. కారేపల్లి ఘటనపై విచారణ జరిపి బాధ్యులను సస్పెండ్ చేయాలనీ కోరుతున్నారు గిరిజన బిడ్డల ప్రాణాలతో చెలగాటమాడుతున్న 'అవినీతి తిమింగలాల' ఆట కట్టించాలని విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు హెచ్చరిస్తున్నారు. పై అంశాలపై వివరణ కోరేందుకు పై అధికారులను ఫోన్ ద్వారా సంప్రదించగా వివరాలు తెలిపేందుకు నిరాకరించారు




## ఎస్జీటీ పోస్టుల కన్వర్షన్ ను ఉపసంహరించుకోవాలి




**నేలకొండపల్లి, మహా:** ఉన్నత పాఠశాలలో హెచ్ఐయం, పీఈటీ పోస్టుల భర్తీ కోసం 2325 కీలకమైన ఎస్జీటీ పోస్టులను కన్వర్షన్ చేయటానికి చేసే ప్రతిపాధనలను ఉపసంహరించుకోవాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.వెంగళరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం సింగారెడ్డిపాలెం పాఠశాలలో సబ్ కమిటి సమావేశం ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు..ఉన్నత పాఠశాలల అభివృద్ధి పేరుతో ప్రాధమిక పాఠశాలలను నిర్వీరం చేయటం తగదని అన్నారు. ప్రాధమిక పాఠశాలలను మూసివేయాలని ప్రమాదకరమైన ఆలోచనల ను ప్రభుత్వం విరమింపచేయాలని హెచ్చరించారు. జీవో నెంబర్ 25 ను వెంటనే సవరించి ప్రాధమిక పాఠశాలలో 20 మంది విద్యార్థులున్న చోట ఇద్దరు ఉపాధ్యాయులను 30 మంది ఉన్న చోట ముగ్గురు ను 30 కి పైగా ఉన్న చోట ప్రతీ తరగతి ఉపాధ్యాయుడు ను నియమించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన ఉద్యోగుల హెల్త్ స్కీమ్ లను ప్రజలలో భాగస్వామ్యమైన ఉద్యోగస్తులకు నగదు రహిత కార్పోరేట్ వైద్యం ను అందించాలని కోరారు. పెండింగ్ లో ఉన్న డీఏ లను, పీఆర్సీ ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశం లో మండల అధ్యక్ష. కార్యదర్శులు గోవిందరావు, రామారావు, సబ్ కమిటి సభ్యులు కోటేశ్వరరావు, చిన్నా, రవి, గణేష్, జ్యోతి, భాగ్యలక్ష్మి. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నత విద్యలో ప్రతిభను చాటాలి

**కళాశాల వీడ్కోలు కార్యక్రమంలో సిఐ శ్రీలక్ష్మి**




**జూలూరుపాడు, మహా:** విద్యార్థులు ప్రాథమిక విద్య నుంచే క్రమశిక్షణతో విద్యాభివృద్ధికి బాటలు వేసుకోవాలని, ఉన్నత విద్యలో ప్రతిభను చాటుకునేందుకు కష్టంగా కాకుండా, ఇష్టంగా చదువుకోవాలని, జూలూరుపాడు సిఐ శ్రీలక్ష్మి విద్యార్థులను కోరారు. బుధవారం మండల కేంద్రంలోని ఎల్లంకి గార్డెన్ ఫంక్షన్ హాల్ లో జరిగిన సాధన జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సీఐ పాల్గొని మాట్లాడారు. తాము ఎంచుకున్న రంగాలలో గొప్పవాళ్లు అయితే తమ భవిష్యత్తును తామే తీర్చిదిద్దుకున్న వాళ్లు అవుతారని, తద్వారా తల్లిదండ్రులకు, గురువులకు, కళాశాలకు మంచి పేరు తెచ్చిన వారవుతారని అన్నారు. అందరూ మంచి క్రమశిక్షణ అలవర్చుకొని విద్యాభివృద్ధిని సాధించాలని సూచించారు. అదేవిధంగా ఇన్నాళ్లు మనతోపాటు కలిసి మెలిసి విద్యను అభ్యసించిన మిత్రుల స్నేహ సంబంధాలను ఎల్లప్పటికీ కొనసాగించాలని తెలిపారు. ఈ ప్రాంతంలో ఎన్నో ఏళ్లుగా విద్యార్థులకు క్రమశిక్షణతో పాటు, నాణ్యమైన విద్యను బోధిస్తూ, ఈ ప్రాంత ప్రజల మన్ననలు పొందిన సాధన కళాశాల యాజమాన్యాన్ని, అధ్యాపక బృందాన్ని ప్రశంసించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఐ శ్రీలక్ష్మిని సాధన కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ వేపూరి నరసింహారావు తో పాటు, కళాశాల అధ్యాపక బృందం శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం విద్యార్థిని, విద్యార్థులు ఆటపాటలతో ఫేర్వెల్ సెలబ్రేషన్ ను ఆనందంగా జరుపుకున్నారు.

## ఔదార్యం చాటిన ఆరోగ్య జీవన యాత్ర బృందం

**క్వింటా బియ్యం వితరణ**



**జూలూరుపాడు, మహా:** జూలూరుపాడు వాకింగ్ క్లబ్ ఆరోగ్య జీవన యాత్ర బృందం తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. ఇటీవల మండల కేంద్రంలోని వెంగన్నపాలెం గ్రామానికి చెందిన తాపీ మేస్త్రి పిన్నుల నరసింహారావు అలియాస్ (ఉంగరాల మేస్త్రి) అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జూలూరుపాడు వాకింగ్ క్లబ్ ఆరోగ్య జీవనయాత్ర బృందం ఆయన కుటుంబానికి సహాయాన్ని అందించాలని సంకల్పించింది. దానిలో భాగంగా ఆయన దశదిన కర్మలకు గాను, తమ వంతు సహాయంగా క్వింటా బియ్యాన్ని వారి కుటుంబ సభ్యులకు బుధవారం అందజేశారు. ఇంటి పెద్దదిక్కును కోల్పోయి పుట్టెడు కష్టాలలో ఉన్న తమను గుర్తించి సహాయానందించిన జూలూరుపాడు వాకింగ్ క్లబ్ ఆరోగ్య జీవన యాత్ర బృందం వారికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యోగా ట్రైనర్ వేల్పుల బోస్, బృందం సభ్యులు సాయిని సత్యనారాయణ, ఉసికల భాస్కర్, మార్కాపూరి నరసింహారావు, పెండ్యాల నరేష్, గడిదేసి ప్రేమ్ కుమార్, పిన్నుల ఆంజనేయులు, షేక్ బుడెన్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# అన్నీ తానై...!

## అంత్యక్రియలలో పాడే మోసి..తల్లి కి కొరివి పెట్టిన కూతుళ్లు



**నేలకొండపల్లి, మహా:** మగ వారు లేకపోవటంతో... కవలలు అక్కాచెల్లలు... అన్నీ తానై తల్లి మృతదేహం పాడే మోసి... తల కొరివి పెట్టి అంత్యక్రియలు నిర్వహించిన ఘటన మండలం లో చోటు చేసుకుంది. వివరాలు, ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం లోని మంగాపురం తండా కు చెందిన తేజావత్ భాగ్యలక్ష్మి (45) అనారోగ్యంతో బుధవారం మృతి చెందింది. ఆమె కు కుమారులు లేకపోవటంతో అంత్యక్రియల పై గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. మగ వారు లేరనే దిగులు వద్దని తాము ఆడపిల్లలైనా కుమారులు చేసే కార్యాలు తామే చేస్తామని తన ఇద్దరు కూతుళ్లు లక్ష్మి ప్రసన్న. శ్రీలత (కవలలు) ముందుకు వచ్చారు. 'తల్లి అంత్యక్రియలు అన్నీ తానై నిర్వహించారు. తల్లి మృతదేహం ను పాడే మోశారు. చిన్న కూతురు శ్రీలత తలకొరివి పెట్టారు. సాంప్రదాయం పద్ధతి లో అంత్యక్రియలను నిర్వహించారు. అక్కాచెల్లలు పాడే మోసే సమయంలో గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు.

## ఆరు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని..

# సిఐటియు ఆధ్వర్యంలో మెరుపు సమ్మె

**బీటీపీఎస్ గేటు ముందు ఆరు గంటల పాటు ధర్నా**




**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం మణుగూరు బీటీపీఎస్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు ఆరు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం మెరుపు సమ్మె నిర్వహించారు. బీటీపీఎస్ ప్రధాన గేటు ముందు సుమారు ఆరు గంటల పాటు భారీ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు కొలగాని బ్రహ్మచారి మాట్లాడుతూ.. వేతనాలు లేక కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక చట్టాలు అమలు కాకపోవడం, కనీస వేతనాలు చెల్లించకపోవడం, జీవో నంబరు 11, 60లను అమలు చేయకపోవడం వంటి అంశాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి నెల మొదటి వారంలో జీతాలు చెల్లించాలనే నిబంధనను యాజమాన్యం ఉల్లంఘిస్తోందన్నారు.జీతాల నుంచి కోతలు పెట్టినా ఈఎస్ఐ, పిఎఫ్ అమలు సరిగా జరగడం లేదని, కార్మికుల భద్రతకు అవసరమైన బూట్లు, హెల్మెట్లు సరైనవి ఇవ్వడం లేదని ఆరోపించారు. బ్యాంకు ద్వారా వేతనాలు చెల్లించకపోవడం, సమస్యలు అడిగిన కార్మికులను వేధించడం, అక్రమ తొలగింపులు జరగడం వంటి అంశాలను ప్రస్తావించారు. ధర్నా నేపథ్యంలో బీటీపీఎస్ సీఈ బిచ్చన్న ఆదేశాల మేరకు అధికారులు చర్చలకు ఆహ్వానించారు. సీఈ ఛాంబర్‌లో జరిగిన చర్చల్లో ఏడు డిమాండ్లపై చర్చించారు. పెండింగ్ వేతనాలు సోమవారం లోపు చెల్లించేందుకు కాంట్రాక్టర్లతో మాట్లాడతామని హామీ ఇచ్చారు. పిఎఫ్, ఈఎస్ఐ కోతలు, యాజమాన్యం వాటా, కార్మికుల ఖాతాల్లో జమ వివరాలను లిఖితపూర్వకంగా తెలియజేయాలని కాంట్రాక్టర్లకు ఆదేశిస్తామని తెలిపారు. బ్యాంకుల ద్వారా జీతాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటామని, అక్రమ తొలగింపులు నిలిపివేస్తామని హామీ ఇచ్చారు.అధికారుల హామీల మేరకు కార్మికులు ధర్నా విరమించారు. హామీలు అమలు కాకపోతే మళ్లీ ఉద్యమం చేపడతామని సిఐటియు నాయకులు హెచ్చరించారు. ఈ ధర్నాలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గద్దల శ్రీనివాసరావు, మణుగూరు మండల కన్వీనర్ కొడిశాల రాములు, జిల్లా కమిటీ సభ్యులు సత్రపల్లి సాంబశివరావు, సారిక, పినపాక మండల కన్వీనర్ సత్యనారాయణ, బీటీపీఎస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఏ రవి, బిక్షపతి, నాగరాజు, సూర్య, రమేష్, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## బాలికల వసతి గృహంలో ఆరోగ్య శిబిరం..



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం అంబేద్కర్ సెంటర్‌లోని బాలికల వసతి గృహంలో ఆరోగ్య శిబిరం నిర్వహించారు. వసతి గృహంలోని విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ప్రధానంగా టాన్సిల్, జలుబు, దగ్గు వంటి సమస్యలతో బాధపడుతున్న వారికి తగిన మందులు అందజేశారు.ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ సునీల్ బాలికలకు పలు సూచనలు చేశారు. వ్యక్తిగత పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని, తడి దుస్తులు ధరించరాదని, పరిశుభ్రమైన శానిటరీ నాప్కిన్లు వినియోగించాలని సూచించారు. అలాగే రోజూ తగినంత నీరు తీసుకోవడం ఆరోగ్యానికి మంచిదని తెలిపారు. శిబిరంలో వైద్య సిబ్బంది రాంప్రసాద్, కృష్ణ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు. బాలికల ఆరోగ్య పరిరక్షణ కోసం ఇటువంటి శిబిరాలు తరచుగా నిర్వహిస్తామని ఈ సందర్భంగా వైద్య సిబ్బంది తెలిపారు.

## దర్జీ కుటుంబానికి మున్సిపల్ చైర్మన్ ఆర్థిక సాయం



**సత్తుపల్లి, మహా:** పట్టణ పరిధిలో దర్జీగా పనిచేస్తూ కుటుంబ పోషణ చేస్తున్న డి.ఎన్ చారి గత కొంతకాలంగా హృదయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ సమాచారం తెలుసుకున్న సత్తుపల్లి మున్సిపాలిటీ నూతన చైర్మన్ రిహానా కమల్ పాషా బాధిత కుటుంబానికి వైద్య ఖర్చుల నిమిత్తం స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ చేతుల మీదుగా పదివేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. చైర్మన్ పదవి చేపట్టి రెండు రోజులు గడవక మునుపే పట్టణ ప్రజల కష్టాలలో సహాయం అందిస్తున్న మున్సిపల్ చైర్మన్ రిహాన కమల్ పాషా ఔదార్యాన్ని పట్టణ ప్రజలు ప్రశంసిస్తున్నారు.

## పర్ణశాల ఆలయ హుండీ లెక్కింపు



**మహా దుమ్ముగూడెం:** ప్రముఖ పుణ్యక్షేత్రం భద్రాచలం అనుబంధం ఆలయమైన పర్ణశాల శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో బుధవారం ఆలయ ఈవో దామోదర్ సమక్షంలో హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. హుండీల ద్వారా 15,27,974 రూపాయలు రావడం జరిగింది. చివరిసారిగా హుండీ లెక్కింపు గత సంవత్సరం జూన్ నెలలో లెక్కింపు చేయడం జరిగిందని తెలిపారు. అనంతరం పర్ణశాల ఆలయ ప్రాంగణంలో ప్రసాదు పథకంలో జరుగుతున్న పనులను పరిశీలించి మార్చి 27 శ్రీరామనవమి దృష్టిలో ఉంచుకొని త్వరగా పనులను పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లకు ఈవో దామోదర్ రావు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ శ్రవణ్ కుమార్ అనిల్ కుమార్ సిబ్బంది స్వచ్ఛంద సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.



## షాదీఖానాను పరిశీలించిన జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి

కారేపల్లి, మహా : కారేపల్లి షాదిఖానా, మస్జిద్ లను జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఎండీ.ముజాహిద్ బుధవారం సంధర్శించారు. రంజాన్ సందర్భంగా ముస్లిం సోదరుల ప్రార్ధనలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మసీద్, ఈద్గా, ఖబరస్తాన్ లను సందర్శించి అక్కడ సమస్యలను స్థానిక ముస్లిం పెద్దలను అడిగి తెలుసుకున్నారు. ముస్లింలు ప్రార్థనలు చేసే ప్రాంతాలలో బ్లీచింగ్ పౌడర్, విద్యుత్ లైట్లు, పిచ్చి మొక్కల తొలగింపు వంటి చర్యలను చేపట్టాలని ముస్లిం పెద్దలు కోరగా వెంటనే స్పందించిన డీఎండబ్ల్యూవో ముజాహిద్ స్థానిక ఎంపీడీవో శ్రీనివాసరావుతో మాట్లాడారు. సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ మజీద్ పాషా (షేరు), మాజీ కో ఆప్షన్ మెంబర్ ఎండీ హనీఫ్, మాజీ షాది ఖానా ఛైర్మెన్ షేక్ షఫీ, మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ తాజుద్దీన్, ముస్లిం పెద్దలు ఎండీ యాకుబ్ అలీ, అబ్దుల్ మతీన్, మీరా పాల్గొన్నారు.

## ప్రోటోకాల్ కంటే సంస్కారానికే ప్రాధాన్యత

**సర్పంచ్ గంగావత్ నవీన్**

**జూలూరుపాడు, మహా:** మండల పరిధి వినోబానగర్ గ్రామంలో సిఎస్ఆర్ నిధులతో ఏర్పాటుచేసిన హైమాస్ట్ లైట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రస్తుత గ్రామ సర్పంచ్ గంగావత్ నవీన్ గ్రామ మాజీ ప్రజా ప్రతినిధులను గౌరవిస్తూ, మాజీ సర్పంచ్, ఉప సర్పంచ్ ల చేతుల మీదుగా ప్రారంభించి ప్రోటోకాల్ కంటే సంస్కారానికే ప్రాధాన్యతనిస్తూ, నేటి సర్పంచులకు ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో రాజకీయాలకు అతీతంగా అందరినీ కలుపుకుని పోవడమే తన లక్ష్యమని అన్నారు. నేను ఒక్కడినే కాదు, నా కార్యకర్తలు కూడా నాయకులుగా ఎదిగి గ్రామాభివృద్ధిలో ముందుండాలని, వారిని ప్రోత్సహిస్తూ, అందరి సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని తెలిపారు. ఈ అభివృద్ధి పనికి సహకరించిన వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ కి సర్పంచ్ నవీన్, గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రస్తుత సర్పంచ్ గంగావత్ నవీన్, మాజీ సర్పంచ్, మాజీ ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువత తదితరులు పాల్గొన్నారు.

## హౌసింగ్ పనులపై ఎమ్మెల్యే పాయం సమీక్ష..

**అర్హులందరికీ నాణ్యమైన గృహాలు..అధికారులకు ఆదేశాలు..**

**మణుగూరు, మహా :** పినపాక నియోజకవర్గం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మణుగూరు మండల పరిధిలో అమలవుతున్న గృహ నిర్మాణ పనుల పురోగతిపై బుధవారం సమగ్ర సమీక్ష నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో హౌసింగ్ విభాగం ఆధ్వర్యంలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణం, లబ్ధిదారుల ఎంపిక, నిర్మాణ నాణ్యత, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు.మండలంలో మంజూరైన ఇళ్ల సంఖ్య, పూర్తి అయిన గృహాలు, నిర్మాణ దశలో ఉన్న ఇళ్లు, ఇంకా ప్రారంభం కాని పనుల వివరాలను అధికారులు ఎమ్మెల్యేకు నివేదించారు. లబ్ధిదారులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా గృహ నిర్మాణం పూర్తి చేసుకునేలా సాంకేతిక సహాయం, నిర్మాణ సామగ్రి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు.పనుల్లో ఆలస్యం జరిగితే సంబంధిత అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించిన ఎమ్మెల్యే, ప్రతి దశలో పర్యవేక్షణ పెంచాలని స్పష్టం చేశారు. అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న గృహ పథకాల ప్రయోజనాలు సమయానికి చేరేలా సమన్వయంతో పని చేయాలని సూచించారు.

**కాలనీల్లో సమగ్ర మౌలిక వసతులు అవసరం**

గృహ నిర్మాణం మాత్రమే కాకుండా కాలనీల్లో రహదారులు, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం వంటి మౌలిక వసతులు సమగ్రంగా కల్పించేందుకు ముందస్తు ప్రణాళికతో పని చేయాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నివసించేందుకు అనుకూల వాతావరణం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.ఈ సమీక్ష సమావేశంలో మండల రెవెన్యూ అధికారి అద్దంకి నరేష్, మండల అభివృద్ధి అధికారి తెగుళ్ల శ్రీనివాస్, ఎంపీఓ పల్నాటి వెంకటేశ్వర్లు, అటవీ అభివృద్ధి అధికారి, అటవీ రేంజ్ అధికారి, సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ విభాగీయ ఇంజినీరు, సహాయ ఇంజినీరు తదితరులు పాల్గొన్నారు.సమీక్ష అనంతరం హౌసింగ్ పనులు వేగవంతం చేసి లబ్ధిదారులకు త్వరితగతిన గృహాలు అందేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

## ఉపాధి హామీ పనులపై సోషల్ ఆడిట్ సమావేశం



**మహా దుమ్ముగూడెం::** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలుపై సోషల్ ఆడిట్ ఈ సందర్భంగా సోషల్ ఆడిట్ టీం ఆధ్వర్యంలో ఉపాధి హామీ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఈసీలు, ఏపీఓలు, పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు.సోషల్ ఆడిట్ టీం సభ్యులు మాట్లాడుతూ.. 19 నుంచి ఈ నెల 27వ తేదీ వరకు మండలంలోని గ్రామాల వారీగా తనిఖీలు చేపట్టనున్నట్లు తెలిపారు. పనుల అమలు, ఖర్చుల వివరాలు, కార్మికుల హాజరు, నాణ్యత అంశాలను పరిశీలించనున్నట్లు వెల్లడించారు. గ్రామాల్లో నిర్వహించే ఓపెన్ ఫోరంలో ఉపాధి హామీ కింద చేపట్టిన పనుల వివరాలను ప్రజల ముందుంచి చదివి వినిపించనున్నట్లు తెలిపారు. ప్రజలకు ఏవైనా అభ్యంతరాలు, ఫిర్యాదులు ఉంటే నేరుగా వెల్లడించవచ్చని సూచించారు. సోషల్ ఆడిట్ టీం నుంచి 16 మంది డీఆర్‌పీలు హాజరుకాగా, ఎస్ఆర్‌పీ రాజశేఖర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వివేక్ రామ్ ఎంపీ ఓ ఏపీఓ సుకన్య రాజసింహ తదితరులు పాల్గొన్నారు.

## కారేపల్లిలో మిషన్ వాక్ ఫిజియోథెరపీ

**22న ఉచిత శిబిరం**




**కారేపల్లి, మహా :** కారేపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మిషన్ వాక్ పౌండేషన్ హై ఆధ్వర్యంలో 22వ తేదిన ఉచిత ఫిజియోథెరఫీ రిహాబిలిటేషన్ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు పౌండేషన్ పౌండర్, న్యూరో రిహాబి ఎడ్యుకేటర్ డాక్టర్ రవి బాదావత్ తెలిపారు. పక్షపాతం, స్ట్రోక్, వెన్నుముక్క నరాల బలహీనత వంటి న్యూరో సమస్యలు ఉన్నవారు. పిల్లల సమస్యలైన సెరెబ్రల్ పాల్సీ, డెవలప్‌మెంట్ డిలే, అలస్యంగా నడక మాట్లాడట్, పుట్టుకతో వచ్చిన కాళ్ల వంకరలు వంటి సమస్యలు ఉన్న వారికి ఫిజియోథెరపీలో మంచి ఫలితాలు లభించాయని డాక్టర్ రవి తెలిపారు. కారేపల్లిలో నిర్వహించే ఉచిత ఫిజియోథెరపీ రిహాబిలిటేషన్ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.